

జీఎస్టీ రద్దు విజయోత్సవ సభ

మంచిర్యాల కలెక్టరేట్/క్రైం సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం జీ ఎస్టీ రద్దు విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల బ్రాంచ్ ఏజెంట్ల అధ్యక్షుడు పూర్ణచందర్, సెక్రటరీ బండి వాసు, ట్రెజరర్ సాగర్‌లు కేక్‌కట్ చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోని అన్ని బ్రాంచ్‌లలో విజయోత్సవ సభలు నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని రద్దుచేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విశ్వేశ్వర్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఆదిరెడ్డి, రాజన్న, రాజు, మల్లికార్జునాయదవ్, ఏజెంట్లు నరసింహారెడ్డి, తిరుపతయ్య, రాజగోపాల్, మల్లారెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, వెంకటేశ్వర్లు, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సరిహద్దులో హై అలర్ట్

● ప్రాణహిత నది తీరం వెంట పోలీసుల తనిఖీలు



ప్రాణహిత తీరంలో జాలర్లతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

కోటపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో తెలగాణ మహారాష్ట్ర సరిహద్దులో పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో సరిహద్దులో ఎలాంటి అలజడులకు తావివ్వకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రెండు రోజులుగా చెన్నూరురూరల్ సీఐ బన్సీలాల్, నీల్వాయి, కోటపల్లి ఎస్ఐలు కోటేశ్వర్, రాజేందర్‌లు మండలంలోని ప్రాణహిత నది తీరం వెంట తనిఖీలు చేపట్టారు. ప్రాణ హిత నది మార్గంలోని ఫెర్రీ పాయింట్లను పరిశీలించారు. సరిహద్దు గ్రామాల నుంచి మహారాష్ట్ర వైపు నది మార్గంలో జరుగుతున్న రాకపోకలకు తనిఖీలు చేపట్టి జాలర్లు, పడవల నిర్వహకులతో మాట్లాడారు. అనుమానస్పద వ్యక్తులు కనబడితే తమకు సమాచారం అందించాలని, అపరిచిత వ్యక్తులకు సహకారం అందించకూడదని సూచించారు. మరో వైపు జాతీయ రహదారిపై అంతర్ రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ బన్సీలాల్ మాట్లాడుతూ మావోయిస్టులు అడవుల్లో ఉండి హింసాత్మక ఘటనలకు పాల్పడుతూ సాధించేది ఏమి లేదని, జన జీవన స్రవంతిలో కలిసి కుటుంబీకులతో కలిసి జీవితం గడపాలని కోరారు.

ప్రతిభ చాటితే ప్రోత్సాహమే ..
● ప్రారంభమైన ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుల నమోదు
● నవంబరు 23న పరీక్ష 7

పత్తిలో చీడపీడలు
● అధిక వర్షాలకు తెగుళ్ల బెడద 6

సింగరేణి లాభాలపై స్పష్టత..!



- 2024-25లో రూ. 2360 కోట్లుగా ప్రకటించిన ప్రభుత్వం
- లాభాల్లో 34 శాతం వాటా చెల్లించేందుకు అంగీకారం
- కార్మికుల వాటాకింద కేటాయించింది రూ. 819 కోట్లు
- ఒక్కో కార్మికుడికి సగటున రూ. లక్షా 95వేల పై చిలుకు
- ఏకపక్ష నిర్ణయంపై ఏఐటీయూసీ పెదవి విరుపు



లాభాలను ప్రకటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంచిర్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ గడించిన లాభాలను ఎట్టకేలకు ప్రకటించింది. సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ ఆర్జించిన నికర లాభం రూ. 6,394 కోట్లుగా ప్రకటించారు. అందులో సింగరేణి భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టుల కోసం రూ. 4,034 కోట్లను కేటాయించగా, మిగిలిన రూ. 2,360 కోట్లలో రూ. 34 శాతం సొమ్ము అంటే రూ. 819 కోట్లను కార్మికుల వాటాగా బోనస్‌గా ప్రకటించారు. ఈ లెక్కన సంస్థలో పని చేస్తున్న 41వేల మంది కారికులకు ప్రకటించిన ప్రకారం 34 శాతం లాభాల బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ. 1,95,610 వరకు లభించనున్నాయి. గత ఏడాది సగటున ఒక్కో కార్మికుడికి రూ. 1,87,321 లాభాల బోనస్ చెల్లించగా, దాంతో పోల్చితే ఈ ఏడాది సగటున ఒక్కో ఉద్యోగికి అదనంగా రూ. 8,289 వరకు బోనస్ లభించనుంది. ఇదిలా ఉండగా సింగరేణి నికర లాభాలు, కార్మికుల వాటా ప్రకటించడంలో సుదీర్ఘంగా జాప్యం జరిగింది. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తుండటంతో ఎట్టకేలకు లాభాల వాటా ప్రకటనకు మోక్షం లభించినట్లయింది. అదే కోలిండియాలో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి లాభాలను ప్రకటిస్తుండగా, సింగరేణిలో మాత్రం సుదీర్ఘకాలం పాటు జాప్యం జరగడం పట్ల కార్మికులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే ఆడిట్ నిర్వహించి లాభాలను ప్రకటించాల్సి ఉంది. అయితే కొన్నేళ్లుగా లాభాల ప్రకటనకు ప్రభుత్వం ఆరేడు నెలల సమయం తీసుకుంటున్నారు.

69 మిలియన్ టన్నుల ఉత్పత్తి...

2024-2025 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి అన్ని ఏరియాల్లో కలిపి మొత్తంగా 69.01 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించింది. అంతకు ఏడాదితో పోల్చితే కొంతమేర..

(తరువాయి 7లో)

వాస్తవ లాభాల నుంచి చెల్లిస్తే బాగుండేది..



సింగరేణిలో లాభాల వాటా అనేది ప్రభుత్వ పథకం కాదు. ఇది సంస్థలో పని చేస్తున్న కార్మికుల శ్రమ. గత ఏడాది 33 శాతం లాభాల వాటాను ఇవ్వగా, ఈ ఏడాది 34 శాతం ప్రకటించారు. లాభాల వాటాను కంపెనీ నికర లాభాల్లో నుంచి ప్రకటిస్తే బాగుండేది. మొత్తం నికర లాభాలు రూ. 6వేల పై చిలుకు కోట్లు ఉండగా, అందులో కేవలం రూ. 2 వేల కోట్ల పై చిలుకు నుంచే 34 శాతం ప్రకటించడం సమంజసంగా లేదు.

-పిట్టల తిరుపతి, ఈపీ ఆపరేటర్, శ్రీరాంపూర్ ఓసీపీ

ఏకపక్ష నిర్ణయం సరికాదు....



లాభాల వాటా ప్రకటించడంలో ప్రభుత్వం ఏకపక్షం గా వ్యవహరించింది. రెండు రోజుల ముందుగానే డి ప్యూటీ సీఎం, సీఎండీలతో చర్చకు పట్టుపట్టగా, తప్పు దోవ పట్టించి ఏకపక్ష నిర్ణయంతో లాభాల వాటాను ప్ర కటించడం సమంజసం కాదు. గత ఏడాది కేవలం రూ. 2 వేల కోట్లను మాత్రమే ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం కేటాయించిన ప్రభుత్వం, ఈ ఏడాది నికరలా భా ల్లో నుంచి ఏకంగా రూ. 4 వేల కోట్ల పై చిలుకు కేటా యించారు. గత సంవత్సరం కేటాయించిన రూ 2 వేల కోట్లను ఎక్కడ ఖర్చు చేశారో కార్మికులకు తెలియజే యాల్సిన అవసరం ఉంది.

- వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

చెన్నూరు, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలు అర్హతగల ప్రతి లబ్ధిదారుడికి అందేలా అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనుల భూగర్భశాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం చెన్నూరుపట్టణంలోని క్యాంపు కార్యాయలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నిరుపేదలందరికీ గూడు కల్పించే ఉద్దేశ్యంతో ప్రతి నియోజకవర్గానికి 3,500ఇందిరమ్మ ఇళ్ల చొప్పున అందించామన్నారు. డిసెంబరు తర్వాత చెన్నూరు నియోజకవర్గాని కి 3,500 ఇళ్లను కేటాయించి అర్హత గల లబ్దిదారులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సోమనపల్లి గ్రామంలో 200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. చెన్నూరు పట్టణంలో 6పడకలుగా ఉన్నడయాలసిస్ సెంటర్‌ను 10పడకలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం మండలంలోని 78మంది లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్‌తో కలిసి కళ్యాణలక్ష్మీ,షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమీషనర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్‌దీపక్

కార్మికులకు 34 శాతం లాభాల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

సింగరేణి కార్మికులకు 34శాతం లాభాల బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే నని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సింగరేణి బొగ్గు గనులను ఆక్షన్‌లో పాల్గొనకుండా గత ప్రభుత్వం అడ్డుకుందని, ఈ కారణంతో గత మూడేళ్ల నుంచి కొత్త గనులు రాలేదన్నారు. కాంట్రాక్టుకార్మికులకు లాభాల వాటా ఎప్పుడూ చెల్లించలేదని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5,500 చెల్లిస్తుందన్నారు. సింగరేణిలో ప్రమాదవశాత్తూ ఎవరైనా చనిపోతే కోటి రూపాయల పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో సుమారు 4వేల టన్నులయూరియా ఇప్పటికే పంపిణీ చేశామన్నారు. గతప్రభుత్వం నిర్లక్ష్యంతోనే కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో పంటపొలాలు మునుగుతున్నాయన్నారు. పంటపొలాలు మునుగుతున్నందున బాల్కసుమన్ వెళ్లి కేటీఆర్ ఇంటిముందు ధర్నా చేయాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ తోడు దొంగలని పేర్కొన్నారు.

ప్రారంభమైన దుర్గామాత నవరాత్రోత్సవాలు

● కొలువుదీరిన అమ్మవారు ● మండపాల్లో ప్రత్యేక పూజలు

లక్షెట్టిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల్లో శ్రీదుర్గామాత అమ్మవారు కొలుదీరారు. సోమవారం మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజలు అందుకోనుంది. స్థానిక గోదావరి రోడ్డులో నెలకొల్పిన అమ్మవారికి పట్టణ పురోహితులు వేదపండితుడు ముద్దు ప్రణవ్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో అమ్మవారు భక్తలకు రోజుకు ఒక ప్రత్యేక అవతారంలో దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో మొదటిరోజు పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణ ప్రముఖులు, అధికారులు, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు అమ్మవారి దర్శనా నికి వచ్చిన భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు.

చెన్నూరు: దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు సోమవారం చెన్నూరు పట్టణంలో, మండలంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. ప్రత్యేకపూజలు చేశారు. కిష్టంపేట, అంగ్రాజ్‌పల్లి, ఎల్లక్కపేట, సుద్దాల గ్రామాల్లో భక్తులు, మంగళహారతులతో అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ప్రతిష్టిం చారు.

దండేపల్లి: దేవి శరన్నరాత్రుల ఉత్సావాలు ప్రారంభమయ్యా యి. మండలంలోని పలుగ్రామాల్లోని సోమవారం దుర్గదేవి విగ్రహాన్ని ప్రతిష్టించిన మొదటి రోజున స్వర్ణ కవచాలకృతదేవిగా అలకరించారు. అనంతరం దుర్గామాతదేవి విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలతో ఒడి బియ్యం పోశారు. భక్తులు కుటుంబ సమేతంగా దుర్గాదేవి మాతను దర్శించుకొని ప్రత్యేక నేవేద్యంలతో పూజలు చేసి మొక్కులుచెల్లించుకున్నారు.

దుర్గామాతకు జీఎం దంపతుల పూజలు

మందమర్రిటౌన్ : పట్టణంలోని వెంకటేశ్వర ఆలయంలో ప్రతి ష్ఠించిన దుర్గామాతకు సోమవారం మందమర్రి జీఎం రాధాకృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఐదు దశాబ్దాలకు పైగా అమ్మవారిని ప్రతిష్ఠించి పూలు చేస్తున్నారన్నారు. పట్టణంలోని వెంకటేశ్వర ఆలయప్రాంగణంలో దేవి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి సింగరేణియాజమాన్యం సహకరిస్తుంద న్నారు. అమ్మవారి దయతో సింగరేణిసంస్థ మరింత అభివృద్ధి చెందాల న్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు దంపతులు పూజలు చేశారు.

బెల్లంపల్లి : పలు వార్డుల్లో భక్తులు దుర్గమాత విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని హనుమాన్ బస్తీలో భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.



లక్షెట్టిపేట గోదావరి రోడ్డులో కొలువుదీరిన అమ్మవారు



బెల్లంపల్లిలో కొలువుదీరిన దుర్గమాత



చెన్నూర్ : కిష్టంపేటలోఅమ్మవారిని తీసుకువస్తున్న భక్తులు

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘం నాయకులు లక్షెట్టిపేట బీసీ హాస్టల్ వార్డెన్, బెల్లంపల్లి ఎస్సీ హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారి వారిపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు అందించారు. కన్నెపల్లి మండలం కొత్తపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు అందించాలని దరఖాస్తు అందించారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన మహమ్మద్ రసూల్ బీ తన భర్త మరణించాడని, తన పిల్లలు తన పోషణ చూసుకోవడం లేదని తనకు న్యాయం చేయాలని దరఖాస్తు అందించింది. అలాగే హాజీపూర్, చెన్నూరు, జన్నారం, బుద్దిపల్లి, ముల్కల్ల, బెల్లంపల్లి ప్రాంతాల నుంచి వచ్చినప్రజలు వివిధ సమస్యలపై దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న జిల్లా సహకార అధికారి బిక్కు రాథోడ్ , బ్యాంకు మేనేజర్ ప్రవీణ్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖాతాదారులు బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల గాయత్రి బ్యాంకు మేనేజర్ కేలేటి ప్రవీణ్ సూచించారు. మంచిర్యాల గాయత్రి బ్యాంకు శాఖ ఖాతాదారుడు మోకనపెల్లి సూర్యం ప్రమాదవశాత్తు మృతిచెందగా అతడి తల్లి మోకనపెల్లి భాగ్యకు సోమవారం లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును జిల్లా సహకార అధికారి బిక్కు రాథోడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ సూర్యంకు ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా ఉండడంతో ప్రమాద బీమా చెక్కు మంజూరైందన్నారు. ఖాతాదారులకు తమ బ్యాంకు అత్యుత్తమైన సేవలందిస్తోందన్నారు. వినియోగదారులకు 24 గంటల పాటు ఏటీఎంలలో నగదు అందుబటులో ఉంచుతున్నామన్నారు. తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ. 6,500తో రుణాలను అందిస్తున్నామన్నారు. సేవింగ్ ఖాతాలను ప్రారంభించడానికి కావాల్సిన ఫోటో, జిరాక్స్ లను బ్యాంకులోనే ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆఫీసర్స్ లు శివకుమార్, రాజు పాల్గొన్నారు.

హాస్టల్స్ కార్మికులను ఆదుకోవాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్

నస్పూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ అసుత్రులు, సంక్షేమ హాస్టల్స్‌లో పని చేస్తున్న వర్కర్లకు వేతనాలు అందక పండగ పూట పస్తులుంటే పరిస్థితి ఏర్పడిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేసిన అనంతరం అదనపు కలెక్టర్ చంద్రయ్యకు వినతి పత్రం అందించారు. ఐదు నుంచి తొమ్మిది నెలల వేతనాలు రాకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తోందన్నారు. పండగ పూట పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వర్కర్ల సమస్య పరిష్కారానికి చేస్తున్న సమ్మెను నాయకులతో చర్చించి సమ్మె విరమణకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన హాస్టల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు మధునమ్మ, లక్ష్మి, బుజ్జి, అలీబాయ్, పోసు, లక్ష్మన్, నర్సయ్య పాల్గొన్నారు.

బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత

సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ, దుర్గామాత నవరాత్రి వేడుకలకు ముందస్తు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జోన్ పరిధిలో మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో దుర్గామాత అమ్మవారు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పెట్రోలింగ్ విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాయంత్రం బతుకమ్మ ఆడే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు నిఘా పెట్టాలన్నారు. దుర్గామాత నవరాత్రి వేడుకలను ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు.

● పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి వెళ్లే ప్రజలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు. వారి వివరాలను నమోదు చేసుకొని వారి ఇండ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

సైబర్ బాధితులకు న్యాయం చేయాలి

సైబర్ క్రైం బాధితులకు సత్వరమే న్యాయం జరిగే విధంగా సైబర్ వారియర్స్ కృషి చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. సోమవారం సైబర్ వారియ ర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైబర్ వారియర్స్‌గా పని చేసిన వారి పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగు తున్నక్రమంలో ప్రజలకు సైబర్ క్రైం సెక్యూరిటీపై అవగాహన కల్పించాలన్నారు. కమిషనరేట్ పరిధిలో 134 సైబర్ కేసుల్లో 4181824 రూపాయలు బాధితులకు వారి సంబంధిత అకౌంట్‌కు రిఫండ్ చేశామన్నారు. లోక్ అధాలత్‌కు సంబంధించి అధిక కేసులు రిఫండ్ అయ్యేలా కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు సైబర్ వారియర్స్‌కు ఆయన ప్రశంసా పత్రం అందజేశారు. సైబర్ క్రైం ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కృష్ణమూర్తి, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఎల్ఆర్ సమావేశం వాయిదా

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీఎల్ఆర్(దీపావళి) వార్షిక బోనస్ నిర్ణయించాల్సిన సమావేశం వాయిదా పడింది. ఢిల్లీలోని కోల్ ఇండియా కార్యాలయంలో సోమవారం సమావేశం జరగాల్సి ఉంది. అయితే యూనియన్ అంతర్గత వివాదంతో ఐఎన్‌టీయూసీ కోర్టుకు వెళ్లింది. విషయం ఎటూ తేలకపోవడంతో కోర్టు తదపరి ఉత్తర్వులు వచ్చే వరకు సమావేశం నిర్వహించకూడదని సీఐఎల్ యాజమాన్యం నిర్ణయించింది. కోల్ ఇండియా యాజమాన్యం నిర్లక్ష్యంతోనే సమావేశం వాయిదా పడిందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత గర్మిళ్లకు చెందిన మిల్కూరి లక్ష్మణ్ (34) మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిల్కూరి త్రివేణికి 13 ఏళ్ల క్రితం లక్ష్మణ్‌తో వివాహం అయింది. కొంత కాలం సంసారం సాఫీగా జరిగినప్పటికి లక్ష్మణ్ మద్యానికి బానిసయ్యాడు. భార్య ఎంత చెప్పినప్పటికి మద్యం మానకుండా రోజు వారీ కూలి డబ్బులతో మద్యం తాగుతూ బానిసయ్యాడు. ఆదివారం సాయంత్రం అతిగా మద్యం తాగి పడుకున్నాడు. ఈ క్రమంలో భార్య అని మందలించడంతో గదిలోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువతిని వేధించిన వారిపై కేసు నమోదు

చెన్నూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్‌ప్రాంతంలో ఓ యువతిని అసభ్యపదజాలంతో వేధించిన ఐదుగురు యువకులతో పాటు వారిపై ఎదురు దాడికి దిగిన యువతి కుటుంబ సభ్యులు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ దేవేందర్‌రావు తెలిపారు. కోటపల్లి మండలం బబ్బెరచెలక గ్రామానికి చెందిన యువతి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం చెన్నూరు పట్టణానికివచ్చింది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో ఓ ఆటోలో ఉన్న ఐదుగురు యువకులు యువతిని అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో యువతి వారితో వారించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న యువతి సోదరులు అక్కడకు చేరుకుని దూషించిన యువకులతో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరగడంతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో యువతిని దూషించిన కోటపల్లి మండలం లింగన్నపేట గ్రామానికి చెందిన కొండగొర్ల రఘు, శేఖర్, ఆసంపల్లి శ్రీకాంత్, రగు, అంజన్నలతో పాటు యువకులపై ఎదురు దాడికి పాల్పడిన యువతి సోదరులు ఆసంపల్లి నందకిశోర్, శ్రీకాంత్‌లపై ఇరు వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గల్లంతైన రైతు మృతదేహం లభ్యం



కన్నిరాం(ఫైల్)

జైనూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గల్లంతైన రైతు మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..జైనూరు మండలంలోని చింతకర్ర పంచాయతీ పరిధిలోని కిసాన్‌నాయక్ తండా గ్రామానికి చెందిన జావ్ కన్నిరాం(70) ఆదివారం సాయంత్రం చింతకర్రవాగు దాటుతుండగా ఒకేసారి వరద ప్రవహం పెరిగి కొట్టుకుపోయి మృతి చెందాడు. కన్నిరాం తన పంట చేనులో వ్యవసాయ పను ల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా గ్రామ సమిపంలోని వాగును దాటుతున్న క్రమంలో వరదనీరు ఒక్కసారిగా ఎక్కువ కావడంతో వాగులో ఆ ప్రవహనికి కొట్టుకు పోయాడు. సోమవారం ఉదయం వాగులో గాలింపు చర్యలు చేపట్టగా కొద్ది దూరంలో కన్నిరాం మృతదేహం లభ్యమైనట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జైనూరు తహసిల్దార్ బీర్‌షావ్, డీటీ మోహన్, పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకొని పంచనామా నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రిపుల్ రైడింగ్ చేస్తే చర్యలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): త్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, రాష్ డ్రైవింగ్ చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. స్థానికంగా సోమవారం ఆయన మాట్లాడారు. మైనర్లకు వాహనం ఇవ్వకూడదన్నారు. మైనర్ వాహనం నడిపినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటాయని చెప్పారు. లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం నేరమని చెప్పారు. కొందరు వాహనదారులు నంబర్ గుర్తించలేని ఫ్యాన్సీ డిజైన్ లేదా తప్పుడు నంబర్లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. నంబర్ ప్లేట్లను నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

దహెగాం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ జ్యోతి సూచించారు. గిరివెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. కూరగాయలు, పండ్లు, పాలు సమృద్ధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా రాజక్క, ఆశా కార్యకర్త సుశీల, తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో చీడపీడలు





రాలిపోతున్న పూత

- అధిక వర్షాలకు తెగుళ్ల బెడద
- దిగుబడిపై రైతుల దిగులు

కెరమెరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈ సారి పత్తి పంట ఆశాజనకంగా ఉంది. కానీ అధిక వర్షాలు కురిసిన ఓట పంటను చీడ, పీడలు ఆశిస్తున్నాయి. ఆరు గాలం కష్టపడి పంటలు పండిస్తున్న రైతులకు ఎప్పటికీ కష్టమే. వర్షాకాలం ప్రారంభంలో ఎంతో ఆశలతో పత్తి పంటకు రైతులు సాగుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మొదట్లో పత్తి పంటకు అనుకూలంగా వర్షాలు కురియడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల వర్షాలు భారీగా కురుస్తుండడంతో పత్తి పంట కొన్ని చోట్ల చూడడానికి చక్కగా, ఏపుగా కన్పిస్తున్నా పూత కాయ, లేక పోవడం, మరి కొన్ని చోట్ల పత్తి పంట ఎదగకపోవడంతో రైతన్నల్లో కలవరం మొదలైంది.

దీనికి తోడు అధిక వర్షాల కారణంగా తేమ శాతం అధికంగా మొక్కకు చేరడంతో తెగుళ్ల బెడద మొదలైంది. పత్తి మొక్కను తెగుళ్లు, పురుగులు, తెల్ల, పచ్చ దోమ వెంటాడుతుండడంతో పూత, కాయలు రావడం లేదు. దీంతో రైతులు పంటలు కా పాడుకునేందుకు తంటాలు పడుతున్నారు. నాలు గేళ్లుగా పత్తి సాగు చేసిన రైతులకు కొంత మేర మద్దతు ధర లభించింది. దీంతో ఈ ఏడాది కూడా రైతులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు.

దుక్కి దున్నడం నుంచి..

దుక్కి దున్నడం, విత్తనాలు, క్రిమిసంహారకాలు, ఎరువుల కోసం ఒక్కో ఎకరాకు సుమారు రూ.30 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు చేశారు. మొదట విత్తనాలు వేసవి సమయంలో సరిగా వర్షాలు కురవ లేదు. మొలకెత్తక పోవడంతో కొందరు రైతులు మళ్లీ విత్తనాలు వేశారు. ఆగస్టు నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండగా ప్రస్తుతం పంటకు చీడపీడలు సోకుతున్నాయి. క్రిమి సంహారకాలు పిచికారి చేద్దామంటే రోజు వర్షం కురుస్తోంది. ఇప్పుడే పత్తి పూత దశలో ఉంది. కొన్ని చోట కాయ దశలో ఉంది. పచ్చ దోమ, తెల్లదోమ ఆశించి మొక్కల అడుగు భాగం నుంచి పత్రహరి తాన్ని పీలుస్తున్నాయి.

దీంతో ఆకులు మొదట పచ్చ బారి ఆతరువాత ఎరుపు రంగులోకి మారుతున్నాయి. ఆకులు కింది వైపునకు ముడుచుకు పోతున్నాయి. చెట్టు కొనలు ముడుచుకు పోయి పెరుగుదల తగ్గి పూత, కాత రావడం లేదు. ఈ పురుగులు రసం పీల్చడంతో గూడలు బలహీన పడతాయి. పిందె పరిమాణం తగ్గుతుంది. ఈ కారణంగా దిగుబడి కూడా తగ్గిపోయే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

యుగేందర్, వ్యవసాయాధికారి, కెరమెరి



పత్తిలో రసం పీల్చే పురుగు నివారణకు ఎసిటామిప్రిడ్ 20 శాతం 30 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. లేడా డైపెం థ్యూరాన్, ఇమామెక్టిన్ 20 లీటర్ల నీటిలో కలిపి పిచి కారి చేసుకోవాలి. లేదా ఎసిఫేట్ 75 శాతం మందును 250 గ్రాములు తీసుకుని 150 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారి చేయాలి. తెగుళ్ల నివారణకు డైప్నొ కొనజోల్, మాంకోజెబ్ మందులు పిచికారి చేసుకోవాలి.

కార్మికుల నిరసన

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్‌లు చేపడుతున్న సమ్మె 11వ రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా సోమవారం మహిళలు బోనాలు ఎత్తుకుని నిరసన ప్రదర్శణ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి బోనాలతో బస్టాండు, మార్కెట్ ఏరియాలో ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో నాకులు దిన కర్, ప్రభాకర్, వసంత్‌రావు, రాంబాయి, కోటయ్య, లక్ష్మణ్, భరత్, రమేష్, సంతోష్, శశికళ, ప్రమీల, ఇందు, రామదాస్, గంగుబాయి, జంగుదేవి, సీతారాం, తిరు పతి, రుక్మాబాయి, దివ్య, లక్ష్మి, మాన్కు, రాధాబాయి పాల్గొన్నారు.

ముగింపు కార్యక్రమానికి మంత్రికి ఆహ్వానం

వాంకిడి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో అక్టోబరు 7న నిర్వహించనున్న వర్షావాస్ (బుద్ధ అండ్ ధమ్మ) గ్రంథ పఠన ముగింపు కార్యక్రమానికి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని ఆహ్వానించినట్లు బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. సోమవారం సమతాసైనిక్ దళ్ సభ్యులు సిద్దార్థ, సునీల్ లతో కలిసి రాష్ట్ర మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, సబ్ కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం, అటవీ శాఖ అనుమతులపై చర్యలు పకడ్బందీగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంతి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, జాతీయ రహదారులు, అటవీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అటవీ శాఖాధికారులు, అదనపు కలెక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారి, రవాణా, జాతీయ రహదా రుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహ దారుల నిర్మాణంలో ముంపునకు గురవుతున్న భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల వివరాలను సేకరించి వారికి మెరుగైన నష్ట పరిహారం అందజేసే విధంగా చర్య లు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియను త్వర గా పూర్తి చేయాలని అటవీ శాఖ అనుమతులు, కోర్టు కేసులను త్వరగా పరిష్కరించి సంబంధిత యజమానులకు నష్ట పరిహారం అందించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జిల్లా అటవీ శాఖాధికారి నీరజ్‌కుమార్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వరరావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్మించిన జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, ఇళ్లు ఇతర ఆస్తులు కోల్పోయిన వారికి నష్ట పరిహారం అందిస్తున్నామని తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న కేసులపై న్యాయ స్థానం తీర్పుతో సంబంధిత యజమానులకు పరిహారం అందిం చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతుల కోసం చర్యలు తీసుకుంటా మనితెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల రాస్తారోకో



రైతులతో మాట్లాడుతున్న ఏవో నాగరాజు, ఎస్సై సర్తాజ్ పాషా

బెజ్జూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రోడ్డుపై యూరియా కోసం రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అదను దాటి పోతున్నా సకాలంలో యూరియా అందక సాగు చేసిన పంటలు నష్ట పోయే అవకాశం ఉందని ఆందోళన చేశారు. యూరియా సోమవారం ఇస్తారని చెప్పి పంపిణీ చేయక పోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు రోడ్డుపై బైఠాయిచారు. విషయం తెలుసుకున్న ఏవో నాగరాజు, ఎస్సై సర్తాజ్ పాషా సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. యూరియా ఇచ్చేందుకు రైతులకు టోకెన్లు జారీ చేస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఆందోళనకు వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): యూరియా రైతులకు సరిపడటం లేదని పంపిణీ చేయాలని సోమవారం రైతులు రెబ్బెనలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రెండు రోజులగా యూరియా కోసం వస్తున్నా అధికారులు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటకృష్ణ అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అధికారులతో చర్చలు జరిపించి రైతులకు యూరియా అందేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.



రెబ్బనలో రైతులతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

రిజర్వేషన్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా రిజర్వేషన్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులకురిజర్వేషన్ ప్రక్రియను చేపట్టేందుకు విధివిధానాలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధవుతున్న తరుణంలో వార్డు సభ్యుల స్థానాలు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని, 2019 స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల రిజర్వేషన్‌ను, 2011 జనాభా, 2024 సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టిన వెనకబడిన తర గతుల గణన ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు నిబంధనలను పాటించాలని అన్నారు. లోటుపాట్లు లేకుండా నివేదిక అందజేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీవో భిక్షపతిగౌడ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు రెఫరీగా రామకృష్ణ



రామకృష్ణ

రెబ్బెన, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఈ నెల 24 నుంచి 28 వరకు నిర్వ హించే జాతీయ సాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటకుల రెఫరీగా రిక్కల వెంకటరామకృష్ణను నియమించినట్టు బాల్ బ్యాడ్మింటన్ ఆఫ్ ఇండియా చీఫ్ రెఫరీ జ్యోతిష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఆర్.నారాయరెడ్డి, అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు అభినందించారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సోమవారం ప్రారంభమైన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాలను జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయబాబు తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఒపెన్ టెన్త్ కేంద్రం ఏర్పాటు చేయగా 59 మందికి గాను 54 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. అలాగే జన్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా 15 మందికి 11 మంది హాజరై నలుగురు గైర్హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో డీఏడ్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించగా 19 మందికి 17 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు.

లాభాల వాటాపై ప్రకటన ఏకపక్షం



నిరసన తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లాభాల వాటాపై సింగరేణి యాజమాన్యం ప్రకటన ఏకపక్షమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. హైదరా బాద్‌లో నిర్వహించిన సమావేశంలో నిరసన తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇవ్వాల్సిన లాభాలను ఆలస్యంగా ప్రకటించారన్నారు. ఈ విషయంలో తాము ఆందోళనలు చేపట్టి ఈ నెల 19న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా చేశా మన్నారు. విషయం తెలుసుకున్న ప్రభు త్వం, యాజమాన్యం గుర్తింపు సంఘమైన తమను హైదరాబా ద్‌కు ఆహ్వానించిం దన్నారు. వెంటనే ముఖ్యమంత్రిని కలిసి లాభాల వాటా, నూతన గనులు, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు, తదితర సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు. ఉప ముఖ్యమంత్రితో మాట్లాడాలని సూచించగా, తాము వారిని కలిసే ప్రయత్నం చేశామన్నారు. కానీ శని, ఆది వారాల్లో చర్చలు జరుపకుండా సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి లాభాల వాటాపై ప్రకటన చేయడం శోచనీయమన్నారు. అంతేకాకుండా వాస్తవంగా వచ్చిన లాభల నుంచి 4 వేల కోట్ల రూపాయలకు పైగా కంపెనీ భవిష్యత్తు అవసరాలకు అని చెప్పి పక్కన పెట్టారన్నారు. కేవలం 2వేల 360 కోట్ల రూపాయలపై మాత్రమే 34 శాతం లాభాల వాటా ఇస్తామని ప్రకటించారన్నారు. మరి గతంలో పక్కన పెట్టిన డబ్బులు ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. గుర్తింపు సంఘంతో సంప్రదించకుండా ఏకపక్షంగా లాభాల వాటాను ప్రకటించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో యూనియన్ అదనపు కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కె. ఎరయ్య, కె. వీరభద్రయ్య, వైవీరావు, మడ్డి ఎల్లయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు ఎల్. ప్రకాష్, కేంద్ర కార్యదర్శులు అక్బర్ అలీ, వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్‌కే బాజీసైదా, సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, తిరుపతి, రవీందర్, రాంగోపాల్, రమణారావు, డీటీరావు, తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ లాభాల వాటా కార్మికులకు చెల్లించడం లేదు



మాట్లాడుతున్న హెచ్ఎంఎస్ నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వాస్తవ లాభాల నుంచి ఉద్యోగులకు వాటా చెల్లించడం లేదని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు రాజిరెడ్డిలు ఆరోపించారు. సోమవారం హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం 6394 కోట్ల నుంచి ఇందులో 4034 కోట్లు కొత్తగనుల కోసం అన్ని చెప్పడం సరైంది కాదన్నారు. ట్రాన్స్‌కో జెన్‌కో నుంచి రావాల్సిన 42 వేల కోట్ల బకాయిలను ఎందుకు వసూలు చేయడం లేదని మండిపడ్డారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు తర్వాత కూడా వాస్తవ లాభాలు ప్రకటించకపోవడం సరైంది కాదన్నారు. రూ. 5 లక్షలు వచ్చేది ఉండగా కేవలం 2 లక్షల వరకు రావడం సరైంది కాదన్నారు. వార్షిక బోనస్‌కు సంబంధించి ఈ నెల 22న ఢిల్లీలో జరగాల్సిన సమావేశం వాయిదా పడిందన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం హెచ్ఎంఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. తమయూనియన్ గౌరవాధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో గోలేటి నుం చి సత్తుపల్లి వరకు యాత్ర ఉంటుందని తెలిపారు.. సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ లాభాలపై 34 శాతం వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలపై 34 శాతం వాటా చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య సోమఉవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరం సంస్థ 6 వేల 394 కోట్ల రూపాయలు లాభం సాధించగా, అందులో 34 శాతం వాటా 2 వేల 173.96 కోట్ల రూపాయలు అవుతుందని తెలిపారు. కానీ ప్రాజెక్టుల కోసం రూ.4034 కోట్లు పక్కన బెట్టిన రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.2360 కోట్లకు మాత్రమే వాటా ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. పర్మనెంటు, కాంట్రాక్ట్ కార్మికులకు కలిపి కేవలం రూ.819 కోట్లు అంటే 12.8 శాతం అందించిందని తెలిపారు.



లాభాల వాటా చెల్లింపునకు ముఖ్యమంత్రి కృషి

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు లాభాల వాటా చెల్లింపునకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సింగరేణి ఉద్యోగులకు ఒరిగిందేమి లేదన్నారు. సింగరేణి సంస్థ నష్టాల ఊబిలో కూరుకుపోయినప్పుడు అప్పుడు కేంద్రమంత్రిగా ఉన్న తన తండ్రి దివంగత కాకా వెంకటస్వామి కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక మారిటోరియం ఇప్పించారని గుర్తు చేశారు. అప్పుడు పెద్ద సంఖ్యలో కార్మికులకు మేలు జరిగిందని తెలిపారు. తాను కార్మిక మంత్రిగా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

కార్మికుల్లో ఉత్సాహం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ ప్రకటించిన లాభాల వాటాతో కార్మికుల్లో ఉత్సాహం నెలకొందని ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు సోమవారం ఒక ప్రటకనలో తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 2 వేల 360 కోట్ల రూపాయల లాభాలను ప్రకటించి అందులో 34 శాతం వాటాన్ని కార్మికులకు ఇచ్చేందుకు నిర్ణయించిందని పేర్కొన్నారు. లాభాల వాటా అందించడంలో ముఖ్య పాత్ర పోషించిన ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్‌కు కార్మికుల పక్షాన హృదయపూర్వక కృత జ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అలాగే మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అభినందనలు తెలిపారు.

శ్రమ దోపిడీకి గురైన కార్మికవర్గం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లాభాల వాటా విషయంలో కార్మికవర్గం శ్రమదోపిడీకి గురైందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి సైతం ప్రాజెక్టుల కోసమని రూ. 4 వేలకు కోట్లకు పైగా పక్కన బెట్టడం సరికాదని పేర్కొన్నారు.కేవలం 12.6 శాతం మాత్రమే ఇస్తూ 34 శాతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పడం సరికాదని తెలిపారు. దీనిపై గుర్తింపు సంఘాలు మాట్లాడడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పర్యటించి ప్రజలతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నప్పటికీ హామీలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. అలాగే గతంలో ఎన్నడూలేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతి మండలంలో రైతులు యూరియా బస్తాల కోసం పడిగాపులు కాస్తున్నారన్నారు. ప్రభుత్వం యూరియా అందించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎవరికి ఏ కష్టం వచ్చిన సంప్రదించాలని కోరారు.

భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హైద్రాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలన్నారు. అటవీ శాఖలోని వన్యప్రాణి సంరక్షణ పరిధిలోకి రాని భూములకు సంబంధించి అనుమతులుత్వరగా మంజూరు చేసేలా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడు తూ జాతీయ రహదారి 163జీ పరిధిలో 3వ విడత ఆర్బిట్రేషన్ కోసం దాఖలు చేసిన 114 కేసులను పరిశీలిస్తామన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు

భీమారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లోని రైతులకు సరిపడ యూరియా దొరక్క కొన్ని రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యూరియా వచ్చిందని తెలియగానే యూరియా పంపిణీ చేసే కేంద్రాలకు వెళ్లి క్యూలో గంటల తరబడి నిల్చుంటున్నారు. వ్యవసాయాధి కారులు రైతుల పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ ద్వారా టోకెన్‌లు ఇచ్చి యూరియాను పంపిణీ చేశారు. కానీ కొంత మంది రైతులకే యూరియా అందడంతో మిగతా వారు నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. మండల కేంద్రంలోని గ్రోమోర్ సెంటర్‌లో సోమవారం వివిధ గ్రామాల రైతులకు 400 బస్తాలను మండల వ్యవసాయాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఈ విషయంపై మండల వ్యవసాయాధికారిని వివరణ కోరగా మండలంలోని ఒక్కో గ్రామానికి ఒక్క రోజు చొప్పున 11 గ్రామ పంచాయతీలకు యూరియాను సరఫరా చేశామని, సోమవారం గ్రోమోర్ సెంటర్‌కు వచ్చిన 400 బస్తాలను రైతులకు అందించామని తెలిపారు. ఇప్పటి వరకు మండలానికి 1177 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిదన్నారు.

యూరియా కోసం బారులు..

మందమర్రిరూరల్ : మండలంలోని సండ్రోన్‌పల్లి గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతులు యూరియా కోసం పెద్ద సంఖ్యలో చేరుకుని క్యూలో ఉన్నారు. ఉదయమే రైతువేదిక వద్దకు వచ్చిన రైతులు పట్టాదారు పుస్తకాలు వరుస క్రమంలో పెట్టి క్యూలో ఉన్నారు. వ్యవసాయాధికారిణి కిరణ్మయి మాట్లాడుతూ పొన్నారం గ్రామ శివారులోని రైతులకు రెండు ఎకరాలకు ఒకయూరియా బస్తా చొప్పున పంపిణీ చేశామని తెలిపారు. మొత్తం 266 యూరియా బస్తాలు రాగా 150కి పైగా పంపిణీ చేశామన్నారు. ఏఈవోముత్యం తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

గ్రంథాలయం పని వేళలు తగ్గించవద్దని నిరసన

బెల్లంపల్లి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాళోజీశాఖ గ్రంథాలయం పని వేళలు తగ్గించవద్దని కోరుతూ సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు పోటీ పరీక్షల అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలోని గ్రంథాలయం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం తీరు ఉదయం 7గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంచాలన్నారు. నియోజక వర్గంలోని 7 మండలా లతో పాటు వివిధ మండలాలకు చెందిన నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయంలో సన్నద్ధమవుతారన్నారు. ఎంతో మంది నిరుద్యోగుల భవిష్యత్ సంబంధిత అధికారుల చేతిలో ఉందని వెంటనే గ్రంథాలయాన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమయ్యే విధంగా సమయపాలన తీసుకరావాలన్నారు. కొందరు లైబ్రేరియన్లు గ్రంథాలయాలను సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. +

వేతనాలు చెల్లించాలని వినతి

లక్షెట్టిపేట, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అవుట్‌సోర్స్‌లో పని చేస్తున్న ఉద్యోగుల పెండ్డింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో కంజర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అధికారి శాంతారాంకు ఉద్యోగులు వినతిపత్రం అందజేసారు. ఏడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడాల్సి వస్తుందని ఉద్యోగుల సమస్యలను గుర్తించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈకా ర్యక్రమంలో మంచిర్యాల జిల్లాలోని సుమారు 25మంది అవుట్‌సోర్స్ ఉద్యోగు లు పాల్గొన్నారు.

ప్రతిభ చాటితే ప్రోత్సాహమే

- ప్రారంభమైన ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తుల నమోదు
- నవంబరు 23న పరీక్ష



కోటపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతూ ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 2008 సంవత్సరం నుంచి ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్) పేరుతో ఉపకార వేతనాలు అందిస్తుంది. 8వ తరగతి చదువుతున్న వారికి ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) నిర్వహిస్తుంది. ప్రతిభ చాటి విజయం సాధిస్తే 9 వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రతి విద్యా సంవత్సరం ఎంపి కైన ఒక్కో విద్యార్థికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఏడాదికి రూ. 12 వేలు నగ దు అందిస్తుంది. ఈ విధంగా ఒక్కో విద్యార్థికి నాలుగేళ్లకు కలిపి మొత్తం రూ. 48 వేలు లబ్ది చేకూరుతుంది. ప్రస్తుతం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎన్ ఎంఎంఎస్ ప్రవేశ ప్రకటన వెలువడుతంది.



అర్హులు వీరే...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం వస్తేచాలు. ప్రభుత్వ, స్థానిక సంస్థల, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ బడుల విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ. 50 ఫీజు చెల్లించాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. 3.5 లక్షలకు మించరాదు.

ప్రారంభమైన దరఖాస్తుల నమోదు

ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆన్ లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హత గల విద్యార్థులు అక్టోబరు 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబరు 23న ఎంపిక చేసిన కేంద్రాల్లో అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

ప్రణాళికతో చదివితే..

ప్రణాళికతో చదివితే ఉపకార వేతనం సులువుగానే అందు కోవచ్చు. మొత్తంగా 180 మార్కులు ఉండగా పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి పరీక్షలో మానసిక సామర్థ్య పరీక్ష 90 ప్రశ్నలకు 90 మార్కులు ఉంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటీస్, సంఖ్యాశాస్త్రము, పదాల భిన్న పరీక్ష, కోడింగ్, డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు నంబర్ అనాలజీ, వెన్‌చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్, అల్ఫాఅవుట్ అనాలజీ తదితర అం శాల్లో ప్రశ్నలుంటాయి. ఇక రెండో విభాగంలో 7,8 తరగతుల సిలబస్ నుంచి 90 ప్రశ్నలకు 90 మార్కులు ఉంటాయి. గణితం 20 మార్కులు, భౌతిక రసాయన, జీవశాస్త్రం కలిపి 35 మార్కులు, సాంఘీక శాస్త్రంలో 35 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో మల్టిపుల్ చాయిస్ రూపంలో ఉంటాయి.

విద్యార్థులకు మెళకువలు నేర్పించాలి

ఎస్. యాదయ్య, జిల్లా విద్యాధికారి



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా మెళకువలు నేర్పించాలి. ఉపకారవేతనం, పేద, మధ్య తరగతి విద్యార్థుల కుటుంబాలకు ప్రయోజనం కల్పిస్తుంది. సమయం ఉన్నందున విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా చదివితే విజయం వస్తుంది. పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై అవగాహన కల్పించాలి.

ఎయిడ్స్ నివారణలో భాగస్వాములు కావాలి

కాసిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ప్రాణాం తక వ్యాధి ఎయిడ్స్ నివారణలో అందరు భాగస్వాములు కావాలని జన జాగృతి కళా బృందం కన్వీనర్ రాజ తిరుపతి అన్నారు. సోమవారం మండలంలోని దేవాపూర్ సిమెంట్ కంపెనీ గేటు ముందు కళాప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ చాపకింద నీరులా శరవేగంగా విస్తరిస్తుందని, దీన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. అరక్షితమైన లైంగిక సంబంధం, ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో కలుషితమైన సూదులు, సిరంజీలు వాడినవి ఉపయోగించడం వల్ల ఈ వ్యాధి సంక్ర మి స్తుందన్నారు. కళాకారులు గణేష్, శంకర్, గౌతమ్, హిమశ్రీ, చైల్డ్‌వన్ ఇండియా లింక్ వర్కర్ రాజేశ్వరి, భాస్కర్, అనిత, ఎన్‌జీవో పార్వతి పాల్గొన్నారు.

సింగరేణి లాభాలపై స్పష్టత..

(5వ పేజీ తరువాయి

ఉత్పత్తి తగ్గింది. 2023-2024లో 70.01 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగగా, గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా ఉత్పత్తిపై ప్రభావం చూపింది. అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం సాధించిన ఉత్పత్తిపై రూ. 6,394 కోట్లు నికర లాభాలు రావడం కొసమెరుపు.

ఏటేటా పెరుగుతున్న లాభాలు..

సింగరేణిలో ప్రతీ ఏటా ఉత్పత్తి లక్ష్యం మేరకు జరు గుతుండగా అదే స్థాయిలో నికర లాభాలను కూడా సంస్థ ఆర్జిస్తోంది. 2013-14లో రూ. 11928 కోట్లుగా ఉన్న అమ్మ కాలు 123 శాతం వృద్ధితో గత ఏడాదికి రూ. 26607 కోట్లకు చేరుకున్నాయి. లాభాలు కూడా గరిష్ఠంగా 193 శాతానికి పెరిగాయి. 2013-14లో రూ. 419 కోట్లు నికర లాభం సాధించగా 1999-2000లో రూ. 300 కోట్ల..లాభాలు ఆర్జించింది. అందులో యాజమాన్యం 10 శాతం బోనస్ ప్రకటించగా, రూ. 30 కోట్లు మాత్రమే కార్మికుల వాటాగా లభించింది. 2000-21లో రూ. 805 బోనస్ ప్రకటించగా, 2021-22 నాటికి రూ. 1227 కోట్ల రూపాయలను సంస్థ ఆర్జించింది. అలాగే 2023-24లో సంస్థ సాధించిన టర్నోవర్ పై కార్మికులు లాభాల వాటా కింద 33 శాతాన్ని ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది రూ. 763 కోట్లు ప్రకటించగా, ఈ సం వత్సరం కార్మికులు, జాతీయ కార్మిక సంఘాల నాయకులు 35 శాతం వాటా కోసం డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం దాన్ని 34 శాతానికి పరిమితం చేసి లాభాల వాటాను కార్మికులకు అందజేయనున్నట్లు ప్రకటిం చింది. ఎనిమిదేళ్ల కాలంలో ప్రగతి బాటన పయనిస్తున్న కంపెనీ ఏటేటా తన లాభాలను పెంచుతూ వస్తోంది.

కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5,500 చెల్లింపు..

పర్మినెంట్ కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా ను ప్రకటించిన సింగరేణి యాజమాన్యం సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా ఒక్కొక్కరికి రూ. 5,500 బోనస్ ప్రకటించింది. గతేడాది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5వేల చొప్పున బోనస్ ప్రకటించగా, ఈ ఏడాది రూ. 500 అదనంగా ఇస్తూ నిర్ణయం తీసుకుంది. యాజమాన్యం నిర్ణయంతో సంస్థలో పని చేస్తున్న 30వేల మంది కాంట్రాక్టు కార్మికులకు లబ్ది చేకూరనుంది.

దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపనకు 53 ఏళ్లు

- కోల్‌కతా ఆచారాలతోనే పూజలు
- ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక శోభ



దుర్గామాతకు వద్ద దీపాలంకరణ చేస్తున్న మహిళ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాకిస్తాన్ క్యాంపులో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన ఈ సారి 53 ఏళ్ల కావస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కలకత్తాకు చెందిన కొంత మంది బెంగాళి కుటుంబాలు మందమర్రిలోని పాకిస్తాన్ క్యాంపునకు తరలి వచ్చారు. విజయదశమి ఆచార వ్యవహారాలను కలకత్తా సంప్రదాయం ప్రకారం ఆచరిస్తున్నారు. కలకత్తాలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన రోజునే ఇక్కడ కూడా కూడా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కలకత్తా ఆచారాల ప్రకారం ఇక్కడ కూడా దుర్గామాతకు పూజలు చేశారు. అప్పట్లో 200 బెంగాళి కుటుంబీలు తరలి రాగా ప్రస్తుతం ఇక్కడ వంద కుటుంబాలు నివసిస్తున్నాయి. విజయదశమి సందర్భంగా ప్రతి సంవత్సరం దుర్గామాత విగ్రహాన్ని ఏర్పాట్లు చేసి నియమనిష్టలతో పూజలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బెంగాళి కుటుంబాలతో పాటు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకుంటున్నారు. బెంగాళి కుటుంబాలకు దుర్గామాత ఆరాధ్య దైవంగా కొలువబడుతుంది. ఈ నెల 22 నుంచి దుర్గా మాత ఉత్సవాలు ప్రారంభం కాగా ఇదే రోజున దుర్గా మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

మట్టి విగ్రహం

దుర్గామాత ప్రతిష్ఠాపనకుముందు కలకత్తా నుంచి వచ్చి కాగజ్‌నగర్ ఈజ్‌గాంలో స్థిరపడిన కళా కారులు వచ్చి దుర్గామాత మట్టి విగ్రహాన్ని తయారు చేస్తారు. విగ్రహం తయారు చేసేంత వరకు వారు కూడా నియమ నిష్టలు పాటిస్తూ విగ్రహాన్ని తయారు చేస్తారు. నిమజ్జనం అయిన తర్వాతనే వారి ఆహారపు అలవాట్లను కొనసాగిస్తారు. విగ్రహ ప్రతిష్ఠాపన మొదటి రోజు బేల్‌పత్రి పూజను నిర్వహిస్తారు. రెండవ రోజు నుంచి ముగింపు వరకు పూజలు కొన సాగిస్తుంటారు. మహిళలు ప్రత్యేకంగా పూజలు, భజనలు చేస్తారు. 17 సంవత్సరాల క్రితం దుర్గామాత కమిటీని ఏర్పాటు చేసి ఈ కమిటీ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు కొన సాగుతుంటాయి. ప్రతి రోజు అన్న దానం కార్యక్రమం నిర్వహిస్తుంటారు. పాకిస్తాన్ క్యాంపు నుంచి శోభాయాత్రగా అమ్మవారి శోభాయాత్రను మందమర్రి కోల్‌బెల్ట్ రోడ్డు మీదుగా గోదావరి నదికి నిమజ్జనం కోసం తరలిస్తారు.

అమ్మ వారిపై అపారమైన భక్తి, నమ్మకం ఉందని బెంగాళీల విశ్వాసం.

సంప్రదాయానికి ప్రతీక దుర్గామాత

బోడ ధర్మేందర్ , దుర్గామాత కమిటీ అధ్యక్షుడు



హిందూ సనాతన ధర్మానికి, సంప్రదాయానికి ప్రతీక దుర్గామాత. 53 ఏళ్లుగా పాకిస్తాన్ క్యాంపు లో దుర్గామాత మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి బెంగాళి సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నాం. ఇక్కడ ఉన్న వంద బెంగాళీ కుటుంబాలు వేడుకల్లో పాల్గొంటారు. ప్రతి రోజు భజనలు, ప్రత్యేక పూజలు చేస్తుంటాం. విజయ దశమి సందర్భంగా పాకిస్తాన్ క్యాంపులో ఆధ్మాత్మిక శోభ సం తరించుకుంటుంది. అమ్మవారి కరుణ కటాక్షాలతో సుఖ సంతోషాలతో ఉంటున్నారు.

మహిళలకు మెరుగైన వైద్యం

దండేపల్లి సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): స్వస్థ్ నారీ సశక్తితో మహిళలందరికీ మెరుగైన వైద్య సేవలు అందుతాయని దండేపల్లి, తాళ్లపేట వైద్యాధికారులు డాక్టర్ సతీష్‌కుమార్, డాక్టర్ కాంత్రికుమార్ అన్నారు. దండేపల్లి, తాళ్లపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సోమవారం పలు గ్రామాలకు చెందిన మహిళలు, గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య శిబిరం నిర్వహించారు. మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మన్మోగ, వాసుదేవన్, సందీప్, సుమేధ, సూర్యప్రకాష్,

సెంట్రల్ లైటింగ్ పనిచేసేలా చూడాలి

భీమారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నేషనల్ హైవే 63 పై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం పనిచేసేలా చూడాలని కోరుతూ బీఆర్ఎస్ నియోజకవర్గయూత్ అధ్యక్షుడు వేముల శ్రీకాంత్‌గౌడ్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. బతుకమ్మ సంబరాలు కూడా ఉన్నందున వెంటనే సెంట్రల్ లైటింగ్ సిస్టం లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఖాదీ వస్త్రాలు వినియోగించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలను వినియోగించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. నస్పూర్ కాలనీ లోని మనోరంజన్ సముదాయంలో ఏర్పాటు చేసిన వావిలాల ఖాదీ గ్రామోద్యోగ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులు 20 వేల రూపాయల వరకు ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసే అవ కాశం ఉందని, ఆ సొమ్మును ఐదు వాయి దాలలో చెల్లించవచ్చన్నారు. ఖాదీ వస్త్రాలపై 30 శాతం, సిల్క్ వస్త్రాలపై 20 శాతం వరకు డిస్కౌంట్ లభిస్తుందని, సింగరేణి ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీనియర్ పీవో కాంతారావు, వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ గోదావరిఖని మేనేజర్ చంద్రమౌళి, ఇన్‌చార్జి అభిషేక్, ఇతర ఉద్యో గులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గాదె సత్యం కోరారు. సోమవారం మంచిర్యాల కార్పొరేషన్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. మంచిర్యాల కార్పొరేషన్‌గా ఏర్పడిన తర్వాత పారిశుద్యం అస్తవ్యస్తంగా మారిందని, వెంటనే పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహించాలన్నారు. సద్దుల బతుకమ్మ పండగను దృష్టిలో ఉంచుకుని వీధి దీపాలు, రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఆటో టాప్‌పై నంబర్లు వేసుకోవాలి

మంచిర్యాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్క ఆటోపై విధిగా నంబరు వేసుకోవాలని మంచిర్యాల సీఐ ప్రమోదరావు అన్నారు. మంచిర్యాల పట్టణం బస్టాండ్ సమీపంలో సోమవారం(ఏఆర్ డబ్ల్యూఏ) ఆటో రిక్షా వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వ ర్యంలో ఆటో టాపులపై నంబర్లు అతికిం చారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఈ నంబర్‌తో ఆటోలను సులభంగా గుర్తించ వచ్చని, అందుకే ప్రతి ఒక్కరు ఆటోపై నం బర్లు విధిగా వేసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఆటో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బచ్చలి మల్లేష్, నాయకులు సత్తయ్య, రాజు, చంద్రయ్య, రాము, కోల రాజాగౌడ్, రవిందర్, పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి

జన్నారం, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సిదార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదిలాబాద్ జిల్లా నంనూర్ మండలానికి చెందిన గిరిజన విద్యార్థి తేజను కళాశాల సీనియర్లు ర్యాగింగ్ పేరుతో హింసించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని నిందితులను కఠినంగా శిక్షించాలని బంజా రా సేవా సంఘం మండల అధ్యక్షులు భీమ్లా నాయక్ అన్నారు. గిరిజన విద్యార్థులు చదువుకోకుండా అడ్డుకున్నవారిని ర్యాగింగ్‌కు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు బానావత్‌రాములు నాయక్, సాయికిరణ్, రాహుల్‌లు పాల్గొన్నారు.

ఆదివాసీ గూడాలను పట్టించుకోని ప్రభుత్వాలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆశయ్య

కాసిపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గూడాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి సాధక బాధలను పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య అన్నారు. సోమ వారం మండలంలోని కొత్త తిర్మలాపూర్‌లో నిర్వహించిన టేకం శంకర్ సంతాప సభకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గూడాలను పట్టిం చుకోకపోవడంతో నేటికి ఆదివాసీ గూడాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయన్నారు. అలాగే విద్య, వైద్యం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే రహదారి సౌకర్యం లేక ఆదివాసీ గూడాల ప్రజలు నేటికి నాటు వైద్యాన్ని నమ్ముతు న్నారన్నారు. పాత తిర్మలాపూర్, కొత్త తిర్మలాపూర్‌లోని ఆదివాసీ గిరిజనుల భూములను ప్రభుత్వం ఆక్రమించుకునేందుకు కుట్రలు పన్నుతుందని, వెంటనే దీన్ని విరమించుకోవాలన్నారు. సరైన పౌష్టికాహారం అందక మహిళలు, యుక్త వయస్సు బాలికలు రక్తహీనతతో మృతిచెందుతు న్నారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి పౌష్టికాహారం అందించాలని, పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. మృతుడు శంకర్ 25 ఏళ్లగా సీపీఎం పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేసి జిల్లా స్థాయి కార్యకర్తగా ఎది గాడని, పార్టీ బలోపేతం కోసం, ఆదివాసీల హ క్కుల కోసం పోరాటాలు చేశాడాన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అశోక్, సీపీఎం జిల్లా నాయకులు రాములు, ప్రకాష్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయ కులు రవికుమార్, నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపు ఉన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోండి

బెల్లంపల్లి, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలుర ప్రీ మెట్రిక్ వసతి గృహ వార్డెన్ అక్రమాలకు పాల్పడుతున్నాడని విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఏఐఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నిగౌడ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. హాస్టల్‌వార్డెన్ విద్యార్థులకు కోడిగుడ్లు, అరటిపండ్లు, పల్లిపట్టీలు సక్రమంగా ఇవ్వడం లేదని వినతిలో పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే వస్తువులను పక్కదారిపట్టిస్తున్నాడని ఈ విషయంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మంత్రికి విన్నవించుకున్నారు. అలాగే ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు హాస్టల్‌వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

బతుకమ్మ పాట ఆవిష్కరణ

జన్నారం,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలమడుగు గ్రామంలో గల వివేకానంద పాఠశాల ఆ ధ్వర్యంలో నిర్మించిన బంగారు బతుకమ్మపాట సీడీలను సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంసీ చైర్మన్ లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ సతీష్, నాయకులు సబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు బీపీ చెక్ చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

భీమారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. సోమవారం భీమారం మండల కేంద్రంలో నూతనంగా 15వ ఆర్థిక ప్రణాళిక నిధులు రూ. 1.40 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానంలో భాగంగా మండల ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు పరిష్కరించేందుకు మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయిస్తానని చెప్పానని, దానిలో భాగంగానే ఆరోగ్య కేంద్రం నిర్మించామన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు, గర్భిణీలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. అలాగే మండలంలో 108 అంబులెన్స్ కోసం గతంలో మండల నాయకులు తన దృష్టికి తీసుకురావడంతో మండల ప్రజల సౌకర్యార్థం 108 అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించానని తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ వంశీకృష్ణ అందుబాటులో ఉంటారని, అనారోగ్య సమస్యలున్న వారు ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయిం చుకోవాలన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో ప్రజల సంక్షేమం అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించామన్నారు. భీమారంలో రూ. 15 కోట్లతో స్టేడియం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గంలో రహ దారుల నిర్మాణంలో అవసరమైన అటవీ అనుమతులు పొంది పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. చెన్నూరు, కోటపల్లి మండలాల్లో పంట సాగుకు అవసరమైన 500 టన్నుల యూరియా అదనంగా అందిస్తామన్నారు.

అలాగే సింగరేణి కార్మికులకు 34 శాతం బోనస్, ఒప్పంద కార్మికులకు రూ.5500 బోనస్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరో గ్యకేంద్రం ద్వారా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్‌కు మంత్రి బీపీ చెక్ చేశారు. అనంతరం మండలంలోని 33 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అనిత, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, మండల తహసీల్దార్ వనజారెడ్డి, అధికారులు, వైద్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ఎప్పుడు?

- రెండో ఏఎన్ఎంలను పట్టించుకోని పాలకులు
- వయసు దాటుతోందని ఆందోళన
- జీవో 18లో చేర్చి రెగ్యులర్ చేయాలని వేడుకోలు
- చాలీచాలని వేతనాలతో ఇక్కట్లు
- 17 ఏళ్ల నుంచి వైద్య సేవలందిస్తున్నామని ఆవేదన
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



బెజ్జూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తోందని వేయికళ్లతో ఎదురుచూస్తున్న రెండో ఏఎన్ఎంల ఆశలు అడియాశలే అవుతున్నాయి. సుమారు 17 ఏళ్ల నుంచి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా వారిని పర్మనెంట్ చేయకపోవడం, వయస్సు పైబడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. పెరిగిన ధరలకు అనుగుణంగా సరైన వేతనాలు లేకపో వడంతో చాలీచాలని కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. జీవో 18లో చేర్చి రెగ్యులరైజ్ చేయాలని వేడుకుంటు న్నారు. జిల్లాలో 335గ్రామపంచాయతీలుండగా, 108ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో 93 మంది రెండో ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నా రు. వీరు 207-10మధ్యలో నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో భాగంగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వాలు మారినా తమ తలరాత మాత్రం మారడం లేదని వాపోతు న్నారు. కొందరి వయస్సు నాలుగు పదులు దాటుతున్నా మారుమూల ప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణంగా 2,500మందికి ఒక ఏఎన్ఎం ఉండాల్సి ఉండగా, నాలుగైదు వేల మంది జనాభాకు ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కొక్కరికి మూడు, నాలుగు గ్రామాలు కూడా ఉన్నాయి.

పనులన్నీ వీళ్లతోనే..

ఆరోగ్య కార్యకర్తలుగా పిలిచే రెండో ఏఎన్ఎంలు ప్రభుత్వం అమలు చేసే పనులకు దగ్గరగా, ప్రభుత్వ ఉద్యోగులకు అందించే ఫలాలకు దూరంగా ఉన్నారనే చెప్పుకోవాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను రెగ్యులర్ వారితో సమానంగా విజయవంతం చేయడంలో పని చేయాల్సిందే. కానీ సెకండ్ ఏఎన్ఎం గర్భిణీలకు మెటర్నిటీ సెలవులు, హెల్త్‌కార్డులు, ట్రావెలింగ్ అలవెన్స్, యూనిఫాం అలవెన్సులు మాత్రం అందవు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో పిల్లలు, తల్లుల ఆరోగ్య సంరక్షణ, టీకాలు వేయడం, క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి రోగపీడితులను గుర్తించి వైద్యసేవలు, ఆరోగ్య సలహాలు అందిస్తుంటారు. ప్రభుత్వం నిర్వహించే డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాలను చేపట్టడం, నేషనల్ ప్రోగ్రాం ఆక్టివిటీస్, ఇంటింటి సర్వేలు, కుష్టు, క్షయ, మలేరియా, డెంగీ వంటి రోగాల సర్వేలు చేపట్టి వైద్యం అందిస్తుంటారు. ఎంసీహెచ్ కిట్(మదర్ అండ్ చైల్డ్ ఇమ్మ్యునైజేషన్), యూవిన్(యూనివర్సల్ ఇమ్యునూజేషన్), ఎన్‌సీడీ, ఐహెచ్ఐపీ వంటి కార్యక్రమాలతో పాటు వీటికి సంబంధించిన 33రిజిస్టర్లు ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ కార్యక్రమాలు నిర్వర్తిస్తుంటారు.

సేవల్లో కీలకపాత్ర పోషించినా..

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విజయవంతంగా చేయడంతో పాటు ప్రజలకు వైద్యసేవలు అందించడంలో రెండో ఏఎన్ఎంలు కీలకపాత్ర పోషిస్తున్నారు. కరోనా సమయంలో సై తం కూడా విధులు విజయవంతంగా నిర్వహించిన వారిపై ప్రభుత్వం శీతకన్ను వేసిందని వారు వాపోతున్నారు. ఒకవైపు ఎన్‌సీడీ పరీక్షలు, సర్వేలు, పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వెళ్లి అల్బెండజోల్ మాత్రల పంపిణీ తదితర పనులన్నీ రెగ్యులర్ వారితో సమానంగా చేస్తున్నా జీతం ఇవ్వడంలో మాత్రం ప్రభుత్వం వ్యత్యాసం చూపడం ఎంత వరకు సమంజసమని రెండో ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా పని చేస్తున్నా సమాన పనికి సమాన వేతనం వర్తించక ఇబ్బందులు పడుతున్నారు. నెల కు రూ.27,300మాత్రమే ఉండగా, రెగ్యులర్ ఏఎన్ ఎంలకు రూ.85వేల నుంచి 90వేల వరకు లభిస్తోం ది. ప్రభుత్వం ఇప్పటికైనా తమను క్రమబద్ధీకరిం చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెగ్యులరైజ్ చేయాలి..

\- భాగ్య, రెండో ఏఎన్ఎం



జీవో 18లో రెండో ఏఎన్ఎంలను చేర్చడంతో పాటు మా సేవలు గుర్తించి రెగ్యులరైజ్ చేయాలి. గతంలో ప్రభుత్వం రెండో ఏఎన్ఎంలకు నిర్వహిం చిన పరీక్ష ఫలితాలను విడుదల చేసి, పోస్టులు పెంచి వారికి రెగ్యులర్ ఉత్తర్వులు జారీ చేయాలి.

దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరిగతిన పరి'ష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దహెగాం మండలం చౌకా గ్రామానికి చౌకధరల దుకాణం మంజూరు చేయాలని కోరుతూ గ్రామస్థులు అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామ పరిధిలోని భీమన్నగూడ గ్రామానికి చెందిన కోలాం గిరిజనులు తమ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్‌కు చెందిన అవిడపు శ్రీకర్ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశాడు రెబ్బెన మండలం వంకులం గ్రామానికి చెందిన రమేష్ తమ భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేసి తమ పేరిట పట్టా మంజూరు చేయాలని, జైనూరు మండలం గూడమామడ గ్రామానికి చెందిన యశోద తాను జీఎన్ఎం వృత్తి విద్యా కోర్సు పూర్తి చేశానని ఉపాధి కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. కౌటాల మండలం గురుడూపేట గ్రామానికి చెందిన నారాయణ తన ఇంటికి గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని దరఖాస్తులు అందజేశారు. కెరమెరి మండలం శివదాస్‌నగర్‌కు చెందిన దస్రు తాను దివ్యాంగుడు అయి నందున ట్రై సైకిల్ మంజూరు చేయాలని, కౌటాల కు చెందిన మల్లయ్య తాను వార సంతలో మరుగుదొడ్లు నిర్మించానని బిల్లులు ఇప్పించాలని దరఖాస్తులు అందజేశారు.

రైలు కింద పడి కూతురితో తల్లి ఆత్మహత్య

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది కాగజ్‌నగర్ చందమామ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి కూతురి(11నెలలు)తో పాటు తల్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. రైల్వే ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జగత్‌రాం, భార్య స్వప్న(27), ఇద్దరు పిల్లలతో ఇటుకల బట్టీలో కాగజ్‌నగర్ మండలం చింతగూడలో నివాసం ఉంటున్నారు. కొన్ని రోజులుగా కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన స్వప్న కూతురు జాస్మితో పాటు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. వారిని అడ్డుకునేందుకు యత్నించిన జగత్‌రాంకు సైతం గాయాలయ్యాయి. జగత్‌రాంను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫిర్యాదులు స్వీకరించి..సూచనలు చేసి..



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుదారుల సమస్యలను విని, చట్ట ప్రకారం పరిష్కరించాల్సిదిగా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత డీఎస్పీ, ఏఎస్పీ, సీఐలతో ఫోన్‌లో మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేశారు. ప్రజలకు మరింత దగ్గరయ్యేలా శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పని చేస్తుందని అన్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ స్కీంలో పని చేస్తున్న ఉద్యోగులకు గత ఐదు నెలలుగా జీతాలివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని మిషన్ భగీరథ ఉద్యోగులతో కలిసి మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం వీరి విషయంలో నిర్లక్ష్యం వహించకుండా వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు.ఆయన వెంట బీఆర్ఎస్ సిర్పూరు కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, నాయకుడు అర్షద్ తదితరులు ఉన్నారు.

అదనంగా యూరియా కేటాయించాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లాకు యూరియా అదనంగా కేటాయించాలని సోమవారం సచివాలయ వ్యవసాయ కమిషనర్ డాక్టర్ గోపిని ఎమ్మెల్యే హరీష్‌బాబు, భారతీయ కిసాన్ మోర్చా బృందం సభ్యులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య, మాజీ అధ్యక్షులు గోలి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డీసీసీ అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో సోమవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు బాలేష్‌గౌడ్, చరణ్, శివప్రసాద్, జమీర్, ఖాలీక్, అసద్, గోపాల్‌నాయక్, కార్తీక్, శైలేందర్ పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జిని రద్దు చేయాలి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సంజీవయ్య కాలనీ సమీపంలో నిర్మాణం చేపట్టనున్న అండర్ బ్రిడ్జిని వెంటనే రద్దు చేయాలని సంజీవయ్య కాలనీకి చెందిన పలువురు సోమవారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ కాలనీ సమీపం నుంచి నిర్మిస్తే చాలా ఇళ్లు పోతున్నాయని, నిలిపివేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యూరియా కోసం రైతుల పడిగాపులు

వాంకిడి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతన్న కష్టాలు తప్పడంలేదు. రోజు రోజుకు యూరియా కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. యూరియా వచ్చిందని తెలిస్తే చాలు వ్యవసాయ పనులు విడిచి రోజంతా భోజనం చేయకుండా వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. మండల కేంద్రంలోని మన గ్రోమోర్ లో యూరియా రావడంతో శని, ఆదివారం రైతులకు పంపిణీ చేశారు. సోమవారం కేవలం 1,500 యూరియా బ్యాగులు మాత్రమే ఉన్నాయని తెలియడంతో మండలంలోని రైతులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి క్యూలో ఉన్న రైతులు నిరసంతో నిలబడలేక చెప్పులను క్యూలో పెట్టారు. రెండు రోజుల క్రితం టోకేన్లు ఇచ్చి న రైతులతో పాటు ఇతర రైతులు కూడా తరలిరావడంతో మన గ్రోమోర్ వద్ద రైతులు బారులు తీరారు. రెండు రోజుల క్రితం టోకేన్లు ఇచ్చిన రైతులకే యూరియా ఇస్తామని చెప్పడంతో టోకేన్లు తీసు కోని రైతులు ఆందోళనకు దిగారు. అందరికీ టోకేన్లు ఇచ్చి రైతులందరికి యూరియా ఇవ్వాలని వాగ్వా దానికి దిగారు విషయం తెలుసుకున్న ఎస్సై మ హేందర్ అందరికి టోకెన్‌లు ఇచ్చి యూరియా పంపిణీ జరిగేలా చూస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. ఎస్సై మ హేందర్ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు.

బెజ్జూరు ,(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. రోజుల తరబడి యూరియా కోసం వరుసలో నిలబడుతున్న సరిపడ యూరియా రావడం లేదంటూ ఆందోళన చేశారు. వివిధ గ్రామా ల నుంచి రైతులు ఉదయం నుంచే యూరియా పంపిణీ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడ్డారు.



వాంకిడిలో యూరియా కోసం చెప్పులు క్యూ లైన్‌లో పెట్టిన రైతులు

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సోమవారం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఏవో మనీషా రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు. అలాగే మరికొంత మంది రైతులకు టోకెన్లు అందజేశారు. మధ్యాహ్న సమయంలో టోకెన్లు అయిపోయాయయని తెలపడంతో రైతులు ఆమె వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో ఎస్సై అనిల్ 'సమార్ రైతులకు నచ్చచెప్పి క్యూలైన్ ఏర్పాటు చేశారు. దీంతో వ్యవసాయాధికారులు క్యూలైన్లలో ఉన్న రైతులకు టోకెన్లు జారీ చేశారు. కోనేరు కార్యకర్తలు రైతులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మనగ్రోమోర్ సెంటర్ వద్ద యూరియా పంపిణీ చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రైతులు బారులు తీరారు. ఉదయం ఆరు గంటలకే రైతులు చేరుకుని రాత్రి 8 గంటల వరకు వరుసలో ఉండి ఒకటి లేదా రెండు యూరియా బస్తాలు ఇవ్వడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. మొత్తం 1, 111 యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు వంశీ, లావణ్య, సిబ్బంది శ్రీనివాస్, రాజు, చందు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై విచారణ చేపట్టాలి

బెజ్జూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యూరియా కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోనేరు వర్గీయులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మండలానికి 95 లారీల యూరియా వచ్చినప్పటికీ రైతులకు సరిపడక దొరకక అవస్థలు పడుతున్నారన్నారు. ఇంత యూరియా సరఫరా అయినప్పటికీ వచ్చిన యూరియా ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, బషరత్‌ఖాన్, సతీష్, మహేష్, నరేందర్‌గౌడ్, జాయిద్ హుస్సేన్, శ్రీనివాస్, రామకృష్ణ, వెంకన్న, సాయి, శేఖర్, అమృత, జావీద్ అలీ, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

సిర్పూర్(టి), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బా లాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోతకు గురైన కల్వర్టు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం వెంకటాపూర్ గ్రామ పంచాయతీలోని బల్హాన్‌పూర్ సమీపంలో ఉన్న కల్వర్టు రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తెగి పోవడంతో రాక పోకలకు ఇబ్బందికరంగా మారింది. బల్హాన్‌పూర్, పార్వతిగూడ, నాయకపుగూడ, ఓటీఘట్, సంతలగుండం గ్రామాల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఆయా గ్రామాలకు వెళ్లె బియ్యం లోడ్ కూడా రాకుండా ఉంది. కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ త్వరలోనే మరమ్మతులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్థులు దేవ్‌పటేట్, విశ్వత్‌రావ్, దంబిరావు, అంబరావు, వసంత్‌రావ్, యశ్వంత్‌రావు, శంభుదాస్, సోము, మాన్కు, బహదర్‌షా, నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.



వరదతీవ్రతకు దెబ్బతిన్న కల్వర్టు

అండర్ బ్రిడ్జి నిర్మాణానికి సర్వే

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సంజీవయ్య కాలనీలో సోమవారం అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం సర్వే చేసేందుకు రైల్వే శాఖ అధికారులు వచ్చారు. తమ కాలనీ సమీపంలో వస్తే తమ ఇళ్లు పోతాయని ఈ అండర్ బ్రిడ్జిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ వాసులు వివిధ సమస్యను అధికారులకు వివరించారు. పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారుకు నివేదిస్తామని చెప్పారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గామాత.. భక్తుల పూజలు



బాల త్రిపురసుందరి అవతారంలో అమ్మవారి దర్శనం

కాగజ్‌నగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో దుర్గామాత విగ్రహాలు ఆయా కూడళ్లలో నిర్వహకులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పండితులు మంత్రోచ్చరణల మధ్య ఈ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే స్థానిక కన్యాక పరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నావరాత్రివేడుకలకు అంతా సిద్ధం చేశారు. తొలి రోజు బాల త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు తల్లి దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా వేద పండితుడు కమలాకర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): ఖైరిగూడ ఓపెన్ కాస్టు ప్రాజెక్టులో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీఎం విజయ భాస్కర్ రెడ్డి దుర్గామాత సన్నిధిలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఎం.నరేందర్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో సోమవారం శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): రాళ్లగూడ, బీబ్రా, దహెగాం, గిరివెల్లి, పీకలగుండం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.